
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





# -47-

## హమ్మయ్యా...మా ఇంటికే వచ్చేసింది కరోనా..పెద్ద పండగ నాడే!

**అసలు జరిగిందేమిటంటే..**

గత డిశంబర్ లో క్రిందటి నెల మా రెండో మనవరాలు బారసాలకి డాలస్ వెళ్ళాం కదా!. అప్పుడేమో ఆ సరదా అయిపోయాక నేనేమో హ్యూస్టన్ వచ్చేశాను కదా! మరి మా క్వీన్ విక్టోరియా గారు 'నేను పది రోజుల పాటు బాలింతరాలిని చూసుకోవాలి. నువ్వెందుకూ ఇక్కడ?' ..అంటే నేను ఏదో వేస్ట్ ఫెలో ని అనే అర్ధంలో చెప్పీ, చెప్పకుండా నన్ను హ్యూస్టన్ పంపించేసి, తను అక్కడే ఉండిపోయింది కదా.

ఆ పది రోజుల తర్వాత అంటే జనవరి 6, 2021 న డాలస్ లోనే మా బావ మరిది పుట్టిన రోజు పండగ నాడు, టీవీలో ట్రంప్ గారు రెచ్చగొట్టగా రెచ్చిపోయి సెనేట్ & కాంగ్రెస్ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్ గారితో సహా అందరూ కలిసి ట్రంప్ గారు ఎన్నికలలో ఓడినట్టు అధికారిక తీర్మానం చేస్తున్నప్పుడు ఏకంగా మా అమెరికా కేపిటల్ భవనాన్నే..అంటే పార్లమెంట్ భవనాన్నే ముట్టడించి, పోలీసులని దాటుకుని లోపలికి వెళ్ళిపోయి రచ్చ రచ్చ చెయ్యడం కళ్ళప్పగించి చూశాం. అక్కడ ఏ క్షణంలో ఎవరి హత్య జరుగుతుందో తెలియని ఉత్కంఠతో అమెరికా అంతటా నిర్ఘాంతపోయిన ఘటన.

ఆ మర్నాడు నేనూ, మా అబ్బాయీ, మా ఆవిడా హ్యూస్టన్ వచ్చేశామా....ఆ మర్నాడనమాట మా క్వీన్ విక్టోరియా మళ్ళీ హాస్పిటల్ లో ఉద్యోగానికి తిరిగి వెళ్ళీ, వెళ్ళగానే వాళ్ళు వేక్సీన్..ఇండియాలో టీకా అంటాం కదా...అదనమాట....ఈ కోవిడ్ –19 కి వచ్చిన కొత్త వేక్సీన్ రెండో డోస్ ఇచ్చారు. తను మొదటి డోస్ తీసుకుని పది రోజులయింది. రెండో డోస్ మర్నాడు తను కాస్త వంకరలు పోయి ఒళ్ళు విరుచుకుంటూ...ఏమిటో ఒళ్ళంతా నొప్పిగా ఉంది, కాస్త జ్వరం కూడా వచ్చిందేమో అంటుంటే అదేదో ఆ రెండో డోస్ వేక్సీన్ బాపతు అనే అనుకున్నాం. అలా

అనుకుంటూ ఉండగానే డాలస్ నించి మా అమ్మాయి పిలిచింది. "అమ్మా, మొన్న నువ్వు మా ఇంట్లో ఉన్నప్పుడు నిన్ను పలకరించడానికి వచ్చినాయనకి కోవిడ్ పాజిటివ్ ట" అని చెప్పగానే మాకు అనుమానం వచ్చేసింది. టెంపరేచర్ చూద్దాం అనుకుంటే ఇప్పటి దాకా మా ఇంట్లో ఆ అవసరమే రాలేదు. అంచేత అర్జంటుగా వెళ్లి ఎందుకైనా మంచిది అని కాస్త ఖరీదు అయినా అత్యంత సొగసుగా ఉండే ఒక థెర్మా మీటర్ కొనుక్కొచ్చాను. అది సొగసుగానే ఆవిడకి కాస్త టెంపరేచర్ ఉంది అని చూపించగానే నాకూ ఒళ్ళు వేడెక్కింది.

వెంటనే మా ఆవిడ వేక్సీన్ వేయించేసుకున్నాం అదా అని అశ్రద్ధ చెయ్యకుండా తను పని చేసే హాస్పిటల్ లో కోవిడ్ టెస్ట్ చేయించుకోగానే అది పాజిటివ్ వచ్చింది. 'ఓరి నాయనోయ్" అని పెద్ద పండగ నాడు నేను కూడా కోవిడ్ పరీక్ష చేయించుకుని 'మమ' అనిపించేసుకున్నాను. ఈ లోగా మా అమెరికా కోటా పద్ధతి ప్రకారం నాకు వేక్సీన్ ఫిబ్రవరి 8 నాడు వేక్సీన్ ఎయ్యడానికి ముహూర్తం పెట్టారు. ఇంతలోనే ఏదో కొంప మునిగిపోయినట్టు ఈ దిక్కుమాలిన కరోనా తొందర పడిపోయింది. మా ఆవిడ విషయంలో కూడా ఇంకా వేక్సీన్ వేయించుకుంటూ ఉండగానే ఈ కరోనాకి అదే తొందర.

వేక్సీన్ వేయించుకోడానికి ఇప్పుడు నా అంతట నేనే ధైర్యంగా వెళ్తున్నానంటే నాకు బాగా చిన్నప్పటి సంగతి ఒకటి గుర్తుకొచ్చింది. వేసవి శలవుల్లో ఒక సారి మా మేనత్త ఉండే దొంతమ్మూరు దుంపల బడిలో పలక మీద అ, ఆ లు దిద్దుతూ ఉండగా ఓ పెద్ద పాలికాపు వచ్చి మా మేష్టారు చింతా దీక్షితులు గారితో "కుసింత టయానికి టీకాలమ్మాయి ఇస్కూలికి ఒస్తారట. పిలగాల్లకి మశూచికీ, మలేరియాకీ టీకాలు ఏస్తారటండి' అని చావు కబురు చల్లగా చెప్పగానే ఉన్న పది మంది పిల్లలం ఉండేలు దెబ్బకి పిట్టలు పారిపోయినట్టు పారిపోయాం. పారిపోయాం అనుకున్నాం కానీ, ఊళ్ళో ఉన్న పెద్దలూ, పాలికాపులూ అందరూ కలిసి చెట్ల మీదా, గడ్డి మేట్లలోనూ దాక్కున్న మమ్మల్ని పట్టుకుని ఇద్దరు క్రిస్టియన్ నర్సులు అందరికీ సూది మందు వేశేశారు. వేస్తూ, వేస్తూ వాళ్ళు వాళ్ళు నవ్వడం, మేము ఏడవడం...అంతా గోల, గోల. ఆ తర్వాత వారం రోజులు జ్వరం. కానీ ఈ సారి జ్వరం వస్తే ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు మరి. నాలుగైదు రోజులు జబ్బ వాపు మటుకు ఖాయం.

మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ఈ కోవిడ్-19 తనంతట తనే రాజు అంకుల్, గడ్డి కోయు గోమేజ్, రిఫ్రిజిరేటర్ రిపేరు వాడూ, ఇలా దశావతారాలలో ఏదో రూపంలో మనింటికే రావచ్చును అనేది ఈ కథలో మొదటి గుణపాఠం. అయితే....కోవిడ్ సోకినంత మాత్రాన మరీ అంత కంగారు పడిపోకుండా నిదానంగా ప్రవర్తించాలి సుమా అనేది అసలు నీతి. క్వీన్ గారికి కాస్త టెంపరేచర్ వలన అనుమానం వచ్చి పరీక్ష చేయించుకోబట్టి తెలిసింది కానీ మాకు కోవిడ్ వచ్చినట్టుగా ఏ విధమైన అవలక్షణాలూ లేవు. లక్షణం గానే ఉన్నా అయినా...రోజూ ఒకటికి రెండు సార్లు టెంపరేచర్ చూసుకోవడం అందరికీ మంచిది. వీలుంటే ఆక్సిజన్ లెవెల్ కూడా చెక్ చేసుకోవడం మంచిది. దానికి ఓ చిన్న నల్ల డబ్బా

లాంటిది మా అమ్మాయి కొనిపెట్టింది. వినాయకుడి బొడ్డులో వేలు పెట్టినట్టు అందులో వేలు పెడితే అది కరవదు సరి కదా, ఎలా తెలుస్తుందో కానీ మన రక్తం లో ప్రాణ వాయువు ఎంత శాతం ఉందో మిలమిల లాడే ఆకు పచ్చ అక్షరాలలో మనకి చూపించేస్తుంది. బాగా తక్కువ ఉంటే అది అరుస్తుందిట. మన కేసులో ఆక్సిజన్ 99% ఉంది కాబట్టి దాని అరుపు వినపడ లేదు. కరోనా వస్తే మొదటి అవలక్షణాలలో జ్వరం, ఆక్సిజన్ తగ్గడం ముఖ్యమైనవి. దగ్గు, రొంప, చీటికీ మాటికీ రెస్ట్ రూమ్ ఎలా ఉందో చూసి రావడం లాంటివి మరి కొన్ని.

ఇంట్లో పట్టపు రాణికి అయినా, పని మనిషికి అయినా ఏ ఒక్కరికి కరోనా సోకినా చెప్పా పెట్టకుండా అది ఆ ఇంట్లోనే ఉన్న మహారాజుకీ, వంట మనిషికీ కదా సోకి తీరును. ఈ 'సామాజిక న్యాయాని'కి మెగా స్టార్ తో సహా ఎవరూ అతీతులు కాదు…ఒక్క మా అబ్బాయి తప్ప. ఎందుకంటే ఎందుకో ఆ యువకుడికి కోవిడ్ నెగెటివ్.

నా ప్రైవేటు క్లాసు ఏమిటంటే ……మాస్క్ పెట్టుకోడం ఈ వైరస్ మనకి రాకుండా ఉండడం కంటే మనం ఊపిరి బయటకి వదిలినప్పుడు పక్కన ఉన్నవాళ్ళకి వ్యాపించకుండా ఉండడం కోసం కదా!. అంచేత ఇది వరకూ ట్రంప్ గారు మాస్కూ లేదు, గాడిద గుడ్డూ లేదు అని ప్రవచించినా, ఇప్పుడు బైడెన్ గారు మాస్క్ పెట్టుకోండి బాబోయ్ అని అరిచి గీ పెడుతున్నా, దేశంలో 80 శాతం జనాభా కి పైగా వేక్సీన్ వేసే దాకా మాస్క్ పెట్టుకుని, కనీసం ఆరు అడుగుల దూరం పాటించడం మనకే మంచిది. పైగా ఈ వైరస్ కొత్త రూపాలు మరీ ఎక్కువ గా వ్యాపిస్తాయి..ట. మీకు కోవిడ్ రాకుండా నేనూ, నాకు రాకుండా మీరూ ముసుగు వీరులు అయితేనే అందరికీ మంచిది. అన్నట్టు మర్చేపోయాను. ఇవాళ ఎన్ని సార్లు చేతులు సబ్బుతో కడుక్కున్నారూ?

చెప్పొద్దూ….పాత సంవత్సరం 2020 వెళ్లి పోగానే హమ్మయ్య అనుకుని సంతోషపడ్డాను. ఇప్పుడు ఈ 2021 లో ఈ దిక్కుమాలిన కోవిడ్ –19 నాకే వచ్చి పోయింది కాబట్టి "హమ్మయ్య , ఇక బెంగ లేదు. అది మన జోలికి మళ్ళీ రాదు కదా అని ఆనందిస్తున్నాను. ఇప్పుడు నేను 'కోవిడ్ వీరుడు" అనే బిరుదు కి అర్హత సంపాదించుకున్నాను. మరొక మాట కూడా చెప్పొద్దూ. అమెరిక్వారంటీన్ లో ఉన్న పదిహేను రోజులూ నేను గాన గంధర్వుడి ని తల్చుకోని రోజు లేదు.

**COMMENTS**